క్లుప్తంగా

వర్క్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం అప్పలరాజు

తగరపువలస: భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాంతంలో గల ఇంటింటికీ ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు బుధవారం వెళ్లి విద్యార్థులకు వర్క్ పుస్తకాలను పంపిణీ చేశారు. వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే రీతిలో ముద్రించిన తెలుగు, గణితానికి సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఎలా రాయాలి? ఎలా చదవాలి? వంటి విషయాలను తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు వివరించారు. జగనన్న బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు స్కూల్‌లో అందుబాటులో ఉంటున్నందున ఎలాంటి సందేహం ఉన్నా విద్యార్థులు రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.రమేష్, బి.మల్లిక, పి.నాగమణి, ఆయా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఓఎస్‌లో ఘనంగా మదర్స్ డే



కేక్‌కట్ చేస్తున్న ఎస్‌ఓఎస్ మదర్స్

భీమునిపట్నం: స్థానిక ఎస్‌ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో బుధవారం మదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. దేశంలో ఉన్న 31 విలేజ్‌లలో తల్లిదండ్రులు లేని పిల్లలకు సేవలందిస్తున్న మదర్స్ కోసం ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విలేజ్ డైరెక్టర్ కోన రవీంద్ర మాట్లాడుతూ ఇక్కడ విలేజ్‌లో పది మంది పిల్లలకు ఉండే ప్రతి ఇంటికి ఒక మదర్ ఉంటారని చెప్పారు. ప్రతి మదర్ తమ వద్ద ఉండే పిల్లలను తల్లి ప్రేమతో ఎంతో ఆప్యాయంగా పెంచి పెద్ద చేస్తారని తెలిపారు. వీరి సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం సందర్భంగా మదర్స్ కేక్‌కట్ చేశారు.

ప్రశాంతంగా పాలిసెట్



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

భీమునిపట్నం: పాలిసెట్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఇక్కడ మొత్తం ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 958 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 894 మంది హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌గా నియమితులైన మండల విద్యాశాఖ అధికారి బాలామణిని అన్ని కేంద్రాలను పరిశీలించారు.

క్రికెట్ స్టేడియం వద్ద పోలీసు బందోబస్తు



క్రికెట్ స్టేడియం బి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్

పీఎం పాలెం: వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద నిర్మించిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ ఆవిష్కరణకు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రానుండడంతో స్టేడియం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్టేడియం వద్ద ప్రత్యేక బారికేడ్లు నిర్మించారు. క్రికెట్ స్టేడియం బి గ్రౌండ్‌లో హెలీ ప్యాడ్‌ను నిర్మించారు.

ఆహ్లాదం.. ఆకర్షణీయం

- రూ. 70లక్షలతో డంపింగ్ యార్డుకు రోడ్డు నిర్మాణం
- గోడలపై వర్ణ చిత్రాలు
- ఆకట్టుకునేలా ఆర్చి
- డివైడర్లపై పూల మొక్కల పెంపకం

ఒకప్పుడు అస్తవ్యస్తంగా ఉన్న డంపింగ్ యార్డ్ రోడ్డు, పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. రోడ్డుకు ఇరువైపులా గోడలపై ఆకర్షణీయంగా రంగురంగుల చిత్రాలను ఏర్పాటుచేశారు. డివైడర్లపై పూల మొక్కల పెంపకం చేపట్టారు.



హైవేని ఆనుకుని ఏర్పాటు చేసిన సుందరమైన ఆర్చ్



సువిశాలంగా, సుందరంగా నిర్మించిన రోడ్డు



గోడలపై వేసిన పెయింటింగ్స్

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు వెళ్లేందుకు ప్రభుత్వం ఇటీవల విశాలమైన రోడ్డును నిర్మించింది. జాతీయ రహదారి నుంచి డంపింగ్ యార్డు వరకూ రోడ్డు నిర్మాణానికి జి–20 సదస్సు నిధులు రూ. 70లక్షలు వెచ్చించింది. సుమారు 15 ఏళ్ల క్రితం నుంచి అస్తవ్యస్తంగా ఉన్న ఈ రోడ్డును 14 మీటర్ల వెడల్పున విస్తరించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఆకట్టుకునేలా ఆర్చిని ఏర్పాటు చేశారు.

వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుతో..

డంపింగ్ యార్డులో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ పనులు శరవేగంగా పూర్తి చేసి ప్రారంభించడంతో ఈ రోడ్డు దశ మారిపోయిందని చెప్పాలి. ప్రో ఎన్విరో సీ అండ్ డీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, వ్యర్థాలు నిల్వ చేసే బయోమైనింగ్ ఏరియా తదితర ప్రాజెక్టులు ఏర్పాటు చేయడంతో డంపింగ్ యార్డ్‌కు కొత్త హంగులు చేకూరాయి. ఒకప్పుడు చెత్త నిర్వహణే సమస్యగా ఉన్న డంపింగ్ యార్డ్ ఇప్పుడు సంపద కేంద్రంగా రూపుదిద్దుకుంది. ఈ నేపథ్యంలో సువిశాల, సుందర రోడ్డు ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా గోడలపై పెయింటింగ్స్ ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డుతో పాటు పరిసరాలు కూడా సుందరంగా దర్శనం ఇస్తున్నాయి. డివైడర్‌పై పూలమొక్కలు వేశారు.

శరవేగంగా పనులు పూర్తి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డంపింగ్ యార్డ్ రోడ్డు నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేశాం. రూ. 70లక్షలతో ఈ రోడ్డును నిర్మించాం .దీని నిర్వహణ పనులు కూడా నిరంతరాయంగా చేస్తున్నాం.

–ఎం. వెంకటరావు,
ఏఈ, ఇంజినీరింగ్ శాఖ, జీవీఎంసీ జోన్–2

చిల్డ్రన్స్ పార్కులో ఆకతాయిల ఆగడాలపై జెడ్సీ సీరియస్



సంతపేట అంగన్‌వాడీ కేంద్రం ముందు మద్యం సీసాలను పరిశీలిస్తున్న జెడ్సీ రాము



చిల్డ్రన్స్ పార్కు ఆవరణలో అనధికారికంగా తవ్విన ఇంకుడుగొయ్యిని పరిశీలిస్తున్న జెడ్సీ

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: భీమిలి జోన్ రెండోవార్డు చిల్డ్రన్స్ పార్కులో ఆకతాయిల ఆగడాలపై జెడ్సీ బి.రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జులాయిలకు అడ్డాగా చిల్డ్రన్స్ పార్క్' అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. సచివాలయ సిబ్బందితో కలిసి పార్కును సందర్శించారు. ఆ సమయంలో అంగన్‌వాడీ భవనం ముందు మద్యం సీసాలను చూసి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయాలని పాఠశాల, అంగన్‌వాడీ నిర్వాహకులకు సూచించారు. పార్కు గేటుకు రెండు రోజుల్లో మరమ్మతులు నిర్వహించాలని వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. పార్కు ఆగ్నేయంలో అనధికారికంగా తవ్విన ఇంకుడు గుంతలో మూడు అడుగుల మేర నీరు నిల్వ ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో చిన్నపిల్లలు పడితే పరిస్థితి ఏమిటని మలేరియా అధికారిని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో డెబ్రిస్ వేయడంతో గోడ కూలిపోయిందని, వెంటనే అక్కడే వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్న వ్యక్తికి ఫోన్ చేసి ఇంకుడుగుంత మూసివేసి, పడిపోయిన గోడను పునరుద్ధరించకపోతే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. డెబ్రిస్ తొలగింపు పనులు టౌన్ ప్లానింగ్ అధికారులు దగ్గరుండి చేపట్టాలన్నారు. ఆయనతో పాటు శానిటరీ ఇనస్పెక్టర్ బి. మహలక్ష్మి నాయుడు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ మేనేజర్ రమేష్

పద్మనాభం: మండలంలోని నాలుగు గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రెండు రోజుల్లో ఏర్పాటు చేయనున్నట్టు మార్క్‌ఫెడ్ మేనేజర్ రమేష్ తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం మొక్కజొన్న కొనుగోలుపై అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఆయన మాట్లాడారు. బాందేవుపురం, కృష్ణాపురం, పాట్నూరు, పాండ్రంగి గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. క్వింటాకు మద్దతు ధర రూ.1962 ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కేంద్రాల్లో మొక్కజొన్నలు విక్రయించాలనుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.ఆధార్ కార్డులను తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. గోనె సంచులు, రవాణా చార్జీలు ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. డీఆర్‌డీఏ డీపీఎం వేదేహి, ఏవో ఎం.వి.ఎస్.చలం, సీసీ పద్మ, వీవోఏలు పాల్గొన్నారు

సీపీఐ నాయకుడు గున్నారావుకు నివాళి



గున్నారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

తగరపువలస: సీపీఐ, ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు తెడ్లాపు గున్నారావు రెండో వర్ధంతి సందర్భంగా బుధవారం గుజ్జు రామునాయుడు భవన్‌లో గున్నారావు చిత్రపటానికి నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధానకార్యదర్శి కొండపు ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నవభారత్ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుంకర రాంప్రసాద్ మాట్లాడారు. జ్యూట్‌మిల్లు, కల్లుగీత కార్మికుల తరఫున గున్నారావు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులు చెలరేగిపోతున్నాయని, వాటికి వ్యతిరేకంగా నాయకులు పనిచేసినప్పుడే గున్నారావుకు నిజమైన నివాళి అన్నారు. నవచైతన్య కళానాట్యమండలి ఉత్తరాంధ్ర ప్రధానకార్యదర్శి సరగడ చిన్నారెడ్డి అభ్యుదయ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో తెడ్లాపు గోపాలకృష్ణ, కానూరి రాంబాబు, చిల్ల అప్పలసూరి, మోర అప్పలరాజు, మావూరి వీర్రాజు, తూతిక సోమరాజు, నూలు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు



చురుగ్గా సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి నుంచి పాత పీఎం పాలెం వైపునకు వెళ్లే రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. జీవీఎంసీ మధురవాడ జోన్ 2 పరిధిలోని 7వ వార్డులోని డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.59.60 లక్షలు మంజూరు చేయగా, ఆ నిధులతో ఈ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినట్టు జెడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూమిని 1 బీలో నమోదు చేసుకున్న వారిపై చర్యలు చేపట్టాలి



తహసీల్దార్ శ్రీవల్లీకి వినతి పత్రం ఇస్తున్న రేవిడి ప్రజలు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో ప్రభుత్వ భూమిని 1బీలో నమోదు చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్ తోట శ్రీవల్లికి బుధవారం వినతి పత్రం ఇచ్చారు. సర్వే నంబర్లు 213–6పి, 214–1, 216–1 లో సుమారు 5.36 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారుల సహకారంతో 1బీ రికార్డుల్లో కొంత మంది వ్యక్తులు తమ పేర్లపై నమోదు చేసుకొని క్రయ, విక్రయాలకు ప్రయత్నిస్తున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎఫ్‌ఎంబీ, విలేజ్ మ్యాప్‌లో ప్రభుత్వ భూమిగా నమోదైందని తెలిపారు. ఆ భూమిని 1బీలో నమోదు చేసుకుని క్రయ విక్రయాలకు ప్రయత్నిస్తున్న నాయకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రెడ్డి చిన్నారావు, ఆర్.ఎస్.నాయుడు, రెడ్డి రామారావుతో పలువురు ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన



పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెం పంచాయతీ ఈగలవానిపాలెంలో పాఠశాల భవనం నిర్మాణానికి బుధవారం నాయకులు శంకుస్థాపన చేశారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు స్థానికులు సమస్యను వివరించారు. దీంతో ఆయన ఆదేశం మేరకు మండల పరిషత్ నుంచి ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు ఈగలవానిపాలెంలో భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లొడగల రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు రౌతు శ్యామల, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నాయకులు లొడగల రమణ, బంక సూర్యనారాయణ, బంక కృష్ణంనాయుడు, ఈగల నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ కల్యాణమస్తు - షాదీతోఫా నిధులు జమ



వైఎస్సార్ కల్యాణమస్తు- షాదీతోఫా లబ్ధిదారులతో భీమిలి జోన్ 2వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 2వ వార్డు సత్యనారాయణపేట మార్కెట్‌వీధికి చెందిన నాలి మోహనరావు, అరుణకుమారి దంపతుల ద్వితీయ పుత్రిక తేజ్‌కుమారికి వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీతోఫా పథకం కింద రూ.50 వేలు మంజూరయ్యాయి.ఈ మేరకు వారి ఖాతాలో బుధవారం నగదు జమ అయింది. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు, సచివాలయ ప్రతినిధులు ఈ విషయం తెలియజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమలాంటి పేదవారి కుటుంబాలలో వెలుగులు నింపుతున్నాయన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీతోఫా పథకం కింద 4,536 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.38.18 కోట్లు జమ అయినట్టు చెప్పారు. ఈ కారక్రమంలో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, ప్రధానకార్యదర్శి చిప్పాడ వెంకటేష్, తెడ్లాపు అప్పలరాజు, సరగడ నాగిరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత



మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్

మధురవాడ: పెందుర్తి 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం విశాఖ జోన్–3 కార్యాలయం పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడ, కొమ్మాది, పీఎంపాలెం, చిట్టివలస, చిట్టివలస రూరల్, భీమిలి సబ్ స్టేషన్ల పరిధిలో కూడా మరమ్మతులు, నిర్వహణ, ఏబీ స్విచ్‌లు ఏర్పాటు పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటలు వరకు మధురవాడ, శివశక్తినగర్, ఆర్టీసీ కాలనీ, నగరంపాలెం, మల్లయ్యపాలెం, చంద్రంపాలెం, రేవళ్లపాలెం, దుర్గానగర్, వాంబేకాలనీ, స్వతంత్రనగర్, గణేష్‌నగర్, సాయిప్రియ గార్డెన్ లే అవుట్, ఏజీజీవోస్ కాలనీ, ఉడా కాలనీ, టీచర్స్ లే అవుట్, వైభవ్‌నగర్, రిక్షా కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

పీఎం పాలెం సబ్ స్టేషన్ పరిధిలో..

ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మిథిలాపురి ఉడా కాలనీ 100 అడుగుల రోడ్డు, ఎస్‌బీఐ, ఐసీసీ బ్యాంకు ఏరియాలు, కృష్ణా లే అవుట్, పిలకవానిపాలెం, పాత మధురవాడ, ఎంవీవీ జోన్ ఏరియా, సాయిబాబా టెంపుల్ ఏరియా, ఎస్ఎస్–4, ఎస్ఎస్–11, ఎస్ఎస్–12, ఎస్ఎస్–13, ఎస్ఎస్–98, ఎస్ఎస్–89 ఏరియాల్లో సరఫరా నిలిచిపోతుంది.

కొమ్మాది సబ్ స్టేషన్ పరిధిలో..

కొమ్మాది సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాంకాలనీ, జీసీసీ లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, అన్నం రాజు నగర్, డీఆర్‌కే రాజు లే అవుట్, రిక్షాకాలనీ, ప్రశాంతి నగర్, దేవి మెట్ట, ఓ జోన్ వ్యాలీ రోడ్డు, ఓ జోన్ వ్యాలీ బ్లాక్స్, జన చైతన్య లే అవుట్, కే1,కే2,కే3 కాలనీలు, నవోదయస్కూలు ఏరియా, బక్కన్నపాలెం, ఎన్టీఆర్‌కాలనీ, లచ్చిరాజు లే అవుట్, సేవానగర్, సూర్య పేపర్, కొమ్మాది విలేజ్, ఎస్‌టీబీఎల్, వైభవ్‌నగర్, ఏయూటీచర్స్ లేఅవుట్, హౌసింగ్‌బోర్డుకాలనీల్లోసరఫరాను నిలిపివేయనున్నారు.

చిట్టివలస సబ్ స్టేషన్ పరిధిలో..

ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం1గంట వరకు తగరపు వలస మార్కెట్, ఆదర్శనగర్, బాలాజీ నగర్ పరిసర ప్రాంతాలు, టి.నగరప్పాలెం, తాటితూరు, మజ్జిపేట, లక్ష్మీపురం, నారాయణరాజు పేట, తాళ్లవలస సబ్ స్టేషన్ పరిధిలో తాళ్లవలస వలస పంచాయతీ, గొల్లల పాలెం పరిసర ప్రాంతాలు, చిప్పాడ సబ్ స్టేషన్ పరిధిలో అన్నవరం, మూలకుద్దు, పెద్దనాగమయ్యపాలెం, అమనాం, దాకమర్రి సబ్ స్టేషన్ పరిధిలో దాకమర్రి పంచాయతీ, బొడమెట్ట పాలెం, కాపులుప్పాడ సబ్ స్టేషన్ పరిధిలో కాపులుప్పాడ, చేపలుప్పాడ పంచాయతీల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోందని శ్రీనివాసరావు తెలిపారు.

కొమ్మాది: జూ పార్క్, దసపల్లా 11 కేవీ ఫీడర్ల మరమ్మతుల నిర్వహణ కారణంగా కూచిపూడి కళావేదిక, జూపార్క్, గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, మునలయ్యపాలెం, భువనేశ్వర్‌కాలనీ, దసపల్లా లే అవుట్, తాటిచెట్లపాలెం, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఏఈ ఎం.రాజేష్ తెలిపారు.

భీమిలిలో...

భీమిలి, జీవీ అగ్రహారం, కొత్తవలస, కృష్ణాకాలనీ, ఎగువపేట, కీతినపేట, డెక్కటిపాలెం, మరడపాలెం, మహాలక్ష్మిపురం, మామిడిపాలెం, రాయపాలెం, కె.మూలకుద్దు, రేకవానిపాలెం, నేరెళ్ళవలస, గంగడపాలెం, కాపులుప్పాడ, కాపులదిబ్బడపాలెం, మంగమారిపేట, నగరపాలెం, తిమ్మాపురం, చుక్కవానిపాలె, నిడిగట్టు, రామజోగిఅగ్రహారం, చేపలు ప్పాడ, కొత్తూరు, పెద్ద ఉప్పాడ, పుక్కళ్ళపాలెం, గొల్లలపాలెం, కళ్ళివానిపాలెం, పాతపరదేశిపాలెం, రెడ్డిలపాలెం, సోమన్నపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏఈ యు.శంకరయ్య తెలిపారు.

పద్మనాభం: బోని సబ్ స్టేషన్‌కు మరమ్మతులు చేపట్టనున్నందున ఈ నెల 12న పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈఈ జగన్మోహన్‌రావు తెలిపారు.

కురుపల్లి కాలనీ, పాండ్రంగి, సామయ్యవలస, మునివానిపేట గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

గ్రామీణులకు వరం.. ఫ్యామిలీ డాక్టర్

- గడప వద్దకే వైద్య సేవలు
- ఆరోగ్యశ్రీ సేవలపై విస్తృత ప్రచారం



ఇంటి వద్ద చికిత్సపొందుతున్న రోగికి సూచనలిస్తున్న వైద్యులు

ఆనందపురం : గ్రామీణ ప్రాంతాల ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం వారి పాలిట వరంగా మారింది. వైద్యులే నేరుగా పల్లెలకు వెళ్లి రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందించడంతో పాటు ఆరోగ్యశ్రీ సేవలను సత్వరమే ఎలా పొందాలో వివరిస్తున్నారు. దీంతో గ్రామీణులకు వైద్య సేవలు పరంగా ఎంతో భరోసా లభిస్తోంది. ఒకప్పుడు ఏ చిన్నపాటి వైద్య సేవలు అవసరమొచ్చినా గ్రామీణ వైద్యులనో, లేదా మండల కేంద్రం వైద్యులనో సంప్రదించవలసి వచ్చేది. రోగ నిర్ధారణకు, వివిధ రకాల పరీక్షలకు వేలాది రూపాయలు వ్యయం చేయవలసి వచ్చేది. దీంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా ఉండేది. నేడు ఆ పరిస్థితికి పూర్తిగా భిన్నంగా వైద్య సేవలన్నీ ఉచితంగా ఇంటి వద్దే అందుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్లు వైద్యులు సేవలు అందించడమే కాకుండా ఏఏ వ్యాధులు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వస్తాయి, ఎక్కడెక్కడ వైద్య సేవలు లభిస్తాయో వివరిస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో గల గ్రామాలను డాక్టర్ల బృందం నెలలో రెండు సార్లు సందర్శించి, రోగులను పరీక్షించి 105 రకాల మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ఉదయం సాధరణ రోగులను పరీక్షించి, మధ్యాహ్నం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందజేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 6న ప్రారంభం కాగా అప్పటినుంచి క్రమం తప్పకుండా వైద్యులు సేవలు అందిస్తుండడంతో నెల రోజులు వ్యవధిలో 5,106 మందికి వైద్య సేవలు అందించగలిగారు. దీంతో ఈ విధానం అందరి మన్ననలు అందుకుంటోంది.

అందుబాటులో ఉన్న పరీక్షలు

ఈ విధానం ద్వారా 13 రకాల పరీక్షలను అక్కడికక్కడే నిర్వహించి రోగ నిర్ధారణ చేస్తున్నారు. హెచ్‌బీ, ఆర్‌బీఎస్, మలేరియా టెస్ట్, యూరిన్ ప్రెగ్నెన్సీ, డెంగ్యూ, హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్ ఏజీ పరీక్ష, ఫైలేరియా, విజువల్ ఇన్‌స్పెక్షన్, ఎసిటిక్ యాసిడ్ పరీక్షలతో పాటు యూరిన్ పరీక్షలో భాగంగా పీహెచ్, ల్యూకోసైట్స్, స్ట్రాస్ గ్లూకోజ్, కేటినో, హిమోగ్లోబిన్, ప్రోటీన్, నైట్రేట్ వంటి పరీక్షలను ఉచితంగా చేసి మందులను అందజేస్తున్నారు.

నెల రోజుల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందించిన సేవలు

మొత్తం క్యాంపులు -	28
పరీక్షించిన రోగులు -	5,106 మంది
గర్భిణులు	567 మంది
బాలింతలు	115 మంది
బీపీ పేషెంట్లు	2047 మంది
షుగర్ పేషెంట్లు	1021 మంది
బెడ్‌రెస్ట్ రోగులు	48 మంది
ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు పొందిన వారు	53 మంది

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం



నాకు ఆరేళ్ల క్రితం పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమయ్యాను. ఆరోగ్య పరీక్షలు కోసం వ్యయ ప్రయాసలకోర్చి ఆస్పత్రికి వెళ్లవలసి వచ్చేది. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో డాక్టర్లు నా ఇంటికి ఇప్పటికి ఆరు సార్లు వచ్చి పరీక్షించారు. అవసరమైన మందులను ఇస్తున్నారు. వైద్య సలహాలను అందజేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– పిన్నింటి రామలక్ష్మి, నేల్తేరు

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 45వ వార్డు, భీమిలి నియోజకవర్గ పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకుతో కలిసి ఆయన పర్యటించారు. సత్యసాయినగర్, వరాహగిరి కాలనీల్లోని మొత్తం 11 క్లస్టర్లలో కాలనీ వాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. మళ్లీ ఈ పథకాలు అందాలంటే మీ ఆశీర్వాదాలు ముఖ్యమంత్రి జగన్‌పై ఉండాలని కోరారు.